# అందరూ మనుషులే!



“ఆనంద్!” ఆమె పిలిచింది. కానీ అది పిలుపు కాదు. బంగాళాలో ప్రతిధ్వనించిన అరుపు!

ఆ అరుపులో గాయపడిన పులిగాండ్రింపులోని గాంభీర్యం ఉంది. దెబ్బతిన్న పక్షి అరుపులోని ఆవేదన ఉంది!

ఆ అరుపుతో చివుక్కున వెనక్కు తిరిగి చూశాడు ఆనంద్!!

ఆమె కరుణ కురిసే కన్నుల్లో కార్చిచ్చు మండుతున్నట్లుంది. అందమైన కిందిపెదవి పండ్లసందులో ఇరుక్కొని మరీ ఎరుపెక్కి కైపెక్కినట్లు వణుకుతూ ఉంది. సొగసైన ముక్కుపుటాలు బుసకొడుతున్నాయి. పూనకం పూనిన మనిషిలాగ వెనక్కు ముందుకు ఊగిపోతూ ఉంది.

ఆనంద్ మొగంలో ఒక్క క్షణం ఆశ్చర్యం!...

అంతలోనే ఆకాశమంత గాంభీర్యం ఆ ముఖంలో అవలీలగా ఇమిడిపోయింది.

ఆనంద్ ఆమెను అలానే చూస్తూ నిలబడ్డాడు.

రాత్రి!– తొలిజాముదాటి మలిజాము అప్పటికే సగానికిసగం గడిచినట్లుంది. ఊరికి చివరగా దాదాపు మూడెకరాల స్థలం... ఆ స్థలం చుట్టూ కోటగోడలాంటి ప్రహరీగోడ... ప్రహరీ లోపలి స్థలమంతా వేప, చింత, పనస, నేరేడు మొదలైన పెద్ద పెద్ద వృక్షాలు. జామ, నిమ్మ, దానిమ్మ మొదలైన ఫల జాతులు. అక్కడక్కడ పూలపాదులు– అదొక ఉద్యానవనంలా చూడముచ్చటగా ఉంటుంది. మధ్య ఒక పెద్ద బంగళా అంతకంటే ముచ్చటగా ఉంటుంది.

తెల్లవాడు రాజ్యమేలుతున్న రోజుల్లో తెలివిగా కట్టుకున్న బంగళా అది.

ఇప్పుడది కలెక్టర్ బంగళా!

ఆ బంగళాలో గడపకవతల ఒకకాలు ఇవతల ఒక కాలుగా నిలబడి వెనక్కు తిరిగి చూస్తున్నాడు కలెక్టర్ ఆనంద్!

ఆవేశాన్ని అదుపులోనికి తెచ్చుకోవాలని చూస్తూఉంది ఆయన సతీమణి నీలిమ.

తొలిజాము ముగిసీ ముగియక ముందే బంగాళాలోని నౌకర్లూ చాకర్లూ మూలకొకరుగా చేరారు. ఆ చలికాలపు తొలిరోజుల్లో దుప్పట్లమాటున ముడుక్కొన్నారు.

"ఏం జరుగుతుందో? ఏమో? అన్న ఆశ్చర్యంతో ఆ కాంపౌండులోని చెట్టూ చేమా నిశ్చలంగా నిలబడుకొన్నాయి. 'ఆలూమగల కొట్లాటెంతసేపు? ఆరిక కూడు ఉడికేదాకనే కదా?' అన్న ధైర్యంతోనే చెట్లమీది పిట్టలు మాత్రం కిచకిచలాడుతున్నాయి.

ఈ వాతావరణం కొనసాగింది కొన్ని నిముషాలే!

నీలిమ మెల్లగా నిలదొక్కుకొనింది. ఆనంద్ మాత్రం గంభీరంగా ఆమెను చూస్తూనే ఉన్నాడు.

"ఊం!... అయితే ఇంట్లో వాళ్ళకంటే మీకు వీధిలో వాళ్ళ బాగోగులే ఎక్కువైపోయాయన్న మాట!"

నీలిమ అడుగుతూఉంటే అక్షరక్షరంలో వ్యంగ్యం తొంగిచూస్తూ ఉంది.

"ఏవరన్నారామాట?"

"...ఎవరో అంటే నాకెందుకీ బాధ?"

"...అంటే నేనన్నాననే కదూ?"

"అరిచేతికి అద్దమెందుకు?"

"అక్కడే నీవు పొరబడుతున్నావ్?"

"హుం! పొరబడడం! ...ఇప్పుడు కాదు. ఎప్పుడో పడ్డాను."

"అంటే?..."

"వివరించి చెప్పాలా?"

"అవసరంలేదు. కానీ అనవసరంగా నువ్వు బాధపడుతున్నావని మాత్రం చెప్పగలను".

"బాధ!... హ్హా హ్హా హ్హా ! నా కెందుకండీ బాధ? ఒకజిల్లా కలెక్టర్ పెండ్లానికి బాధలా? వింటే ఎవ్వరైనా నవ్విపోతారు. చేయి చాపకనే చేతికందే సౌకర్యాలు. ప్రతిరాత్రి నా గదికి నన్నొదిలి ప్రజాసేవకు అంకితమైన త్యాగమూర్తి నా భర్త..."

"నీలూ?" కర్కశంగా వెలువడిందా పిలుపు.

"ఏం?... కొడతారా?"

"హుఁ! నువ్వు నన్నింత బాగా అర్థం చేసుకొన్నందుకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాకుండా ఉంది."

"మీరెందుకండీ ఏడవడం? రోజూ నేనేడుస్తుంటే!"

"ఎందుకూ?"

"అది ఆడది నోరువిప్పి చెప్పుకోలేని బాధ!"

"నీ చదువూ సంస్కారాలేమయ్యాయి?"

"చదువూ సంస్కారాలు ఆడదానికి సుఖాన్ని కూడా సమకూరుస్తాయా? అయ్యో! నాకు తెలియదే?"

"సుఖాలే జీవితధ్యేయాలన్నమాట! కస్తూరిబాఅలా అనుకొనిఉంటే గాంధీ మహాత్ముడయ్యే వాడేకాదు."

"మీరు మహాత్ములు కావాలని మథనపడుతున్నారా? అయితే అందులో స్వార్థం లేదా?"

"నీలూ! ఒక్కసారి వెనక్కు తిరిగి చూడు. మనం కలిసి చదువుకొనే రోజుల్లో ప్రతిరోజూ రాత్రిపూట మూడుమైళ్ళ దూరాన ఉన్న ఆ మారుమూల పల్లెకు నడిచి వెళ్ళేవాడిని. వయోజనులకు చదువుచెప్పేవాడిని. ఏ ప్రతిఫలం ఆశించి? ఏదో వాళ్ళు పెట్టింది తినేవాణ్ణి. అక్కడే గుడిసెల్లో గుడ్డిదీపాల వెలుగులో చదువుకొనేవాణ్ణి. ఉదయాన్నే తిరిగి వచ్చేవాణ్ణి. కాలేజీలో ఎవరికే కష్టం కలిగినా అది నా కష్టంగా భావించి తవ్వి తలకెత్తుకునే వాణ్ణి. ఈనా సేవాభావమే కదా నాపైన నీకొక అభిప్రాయాన్ని ఏర్పరచింది. లేకుంటే నువ్వెక్కడ? నేనెక్కడ? ఎంతో ఉన్నత వంశానికి చెందిన నువ్వు నన్ను ప్రేమించేదానివేనా?... ఏమయిందా త్యాగబుద్ధి?"

"అప్పుడు జీవితమంటే త్యాగమే అనుకొన్నాను. అందుకే నా వాళ్ళందర్నీ దూరం చేసుకొని రాగలిగాను."

"మరి ఇప్పుడేమయింది?"

"జీవితమంటే త్యాగమేకాదు- స్వార్థం కూడా అని అర్థంచేసుకొంటున్నాను."

"త్యాగాన్ని స్వార్థంగా చిత్రించడానికి నీ మనస్సెలా ఒప్పింది నీలూ?"

"పసుపు మరకలు మాయనైనా మాయలేదే? మరి నెలరోజులుగా ప్రతిరాత్రి నా బాధకు నన్నొదిలి వెళ్ళిపోవడానికి నీకు మనస్సెలా ఒప్పింది ఆనంద్?"

"నీలూ మనం అనుభవిస్తున్నది తాత్కాలికమైనబాధ. అది తీరనిబాధకాదు. తీయని బాధ. పాపం! ఆ గూడెంలోనివాళ్ళు అనుభవిస్తున్నది హింస. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న చిత్రహింస. నా తండ్రి అలాంటి చిత్రహింసకే గురయ్యాడు. ఆ బాధ నుండి కోలుకోలేకనే నా తల్లిపోయింది. అది తలుచుకుంటే ఇప్పటికీ వొళ్ళు జలదరిస్తుంది. ఈ లేత గుండెమీద పడినకోత ఇంకా మానలేదు నీలూ! అందుకేకదా ఆ జాతిని ఆ చిత్రహింసనుండి విముక్తుల్ని చేయాలనేకదా ఏరికోరి ఈ జిల్లాకు వచ్చింది. ఆపని కాస్తా పూర్తయితే మనకేం?– స్వర్గసుఖాల్నే మనకు బానిసలుగా చేసుకోవచ్చు"

"ఒకవేళ ఇది అంతంకాకుండా ఆరంభమైతే?"

"అర్థాంగిగా నువ్వు ఆమాత్రం అర్థంచేసుకోలేవా?"

"నావల్ల కాదుబాబూ!"

"అయితే ఏం చెయ్యాలంటావ్?"

"ఏదో ఒకటి తేల్చి చెప్పమంటాను."

"అంటే ..."

"అంటే నేను కావాలో లేక ఆ గూడెంలోని ముదనష్టపు మూకే కావాలో?"

"నీలూ!" ఆవేశంగా అరిచాడు ఆనంద్?

"ఆనంద్! నీకోసం... నీ ప్రేమకోసం నావాళ్ళందర్నీ వదులుకొన్నాను. కానీ నువ్వు మాత్రం నీ వాళ్ళని వదల్లేనంటున్నావ్!– ఇదేమైనా న్యాయంగా ఉందా? పోనీ! వాళ్ళ బాగోగులు చూడవద్దని నేననలేదే? ఆఫీసు పనుల్లో అదీ ఒక భాగంగా పెట్టుకో!– అంతేకానీ పగలలా? రాత్రుళ్లు ఇలాఅయితే– ఎంతకాలమని భరించేది? ఎంతనిగ్రహించుకొన్నా ఒక్కొక్కప్పుడు మనసు వికలమవుతూ ఉంది. వెళ్ళిపోదామనుకుంటాను. ఎక్కడికి పోవాలి? నావాళ్ళ దగ్గరికి పోలేను. వాళ్ళకు మొగంచూపలేను. దీనికి పరిష్కారమేమిటో నువ్వే చెప్పు. ఆ మీదట నీ ఇష్టం వచ్చినచోటికి వెళ్ళు."

ఆమె కంఠం రుద్ధమయింది.

"ఆవేశంలో ఆలోచన కోల్పోయిన దానివి. ఇప్పుడు నీకేమి చెప్పినా నువ్వు వినిపించుకొనే స్థితిలో లేవు."

అంతే! జీప్ స్టార్టయింది. ముందుకు దూసుకు పోతూఉంది.

* * * *

ఆ రోజు––

సరిగ్గా నెలకిందట ఒకరోజు.

ఆనంద్ ఆనందానికి అవధులులేవు.

అదే జీప్!... అదే బాట!–

ఆ బాటంతా మూరెడెత్తు మిట్టపక్కన్నే బారెడు లోతు పల్లం. గతుకులు గతుకులుగా ఉంది. ఎగుడుదిగుడుగా ఉంది. ఆ మారుమూల పల్లెల్లో మారని బతుకులకు అద్దంపట్టి నట్లుంది.

ఆ బాటమీద జీప్!... జీప్‌లో ఆనంద్!

ఆ మిట్టపల్లాల బాటమీద డ్రైవర్ ఎంతో చాకచక్యంగా జీప్ నడుపుతున్నా ఒకసారి ఉన్నట్లుండి వలపటితట్టుకు వాలిపోతూ ఉంది. మరుక్షణమే దాపటిపక్కనగుంతలో దభాలున పడుతూ ఉంది. డ్రైవర్ ఏమాత్రం అజాగ్రత్తపడినా జీప్ బోల్తాకొట్టడం ఖాయం!

అయినా ఆనాడు ఆనంద్ ఆనందానికి అవధులులేవు!

అప్పటికి ఆరేండ్ల కిందటే ఆనంద్ ఐ.ఎ.ఎస్. పరీక్షలో నెగ్గాడు. ప్రథముడుగా నెగ్గాడు. బంగారు పతకం తనమెడలో సింగారాలు పోయింది.

ఆరోజు కూడా ఇంత ఆనందాన్ని పొందలేదు!

ఈ దేశంలో ఉద్యోగం అనేది ఒకమాయలేడి! చిక్కినట్లే దక్కినట్లే చేతికందకుండా లెక్కలేనన్ని చిక్కులుపెడుతుంది. అయితే ఆనంద్‌ను మాత్రం వెదుక్కుంటూ వచ్చింది. ఊళ్ళేలే ఉద్యోగమే వచ్చింది. వచ్చిన నాలుగైదేండ్లకు ప్రమోషన్ వచ్చింది. ఆనంద్ కలెక్టరయ్యాడు.

అప్పుడు కూడా ఇంత అనుభూతిని పొందలేదు.

ఆమె పేరు నీలిమ!–

ఆమె ఒక సజీవశిల్పం. ఆ సజీవశిల్పాన్ని మలిచినవాడు మహా నేర్పరి. పొందినవాడు అదృష్టవంతుడు. ఆ సజీవశిల్పం ఒకనాడు ముగ్ధమనోహరంగా తయారై అతనిముందు నిలబడి మూడుముళ్ళు వేయమనింది!

అప్పుడు కూడా ఆనంద్ ఇంత ఆనందపడలేదు!

అతని తొడమీద ఒక ఫైలు. చేతి దాపున్నా ఎదురుగాలికి ఎగిరిపోతానని బెదిరిస్తూ ఎగిరెగిరి పడుతూ ఉంది. ఆ ఫైల్లో కాగితాలు నొసటిమీద వెంట్రుకల్లా ఎగిరెగిరి పడుతున్నాయి. ఆ ఫైలుతో అతడంత ఇబ్బంది పడాల్సిన అవసరమేలేదు. తహశీల్దారు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, క్యాంప్ క్లార్క్, బిళ్ళజవాను, తనచుట్టూ నాలుగు దిక్కుల్లా నలుగురు! ఎవరిచేతికిచ్చినా తమ ప్రాణాలకంటే భద్రంగా మోసుకొని వచ్చేవాళ్ళే! ఐతే అతనికి అందులో తృప్తిలేదు.

ఆఫైలును ప్రథమసంతానంలా ఒక్కసారి తృప్తిగా చూసుకొన్నాడు. ఆఫైలు ఒకగూడెం గత చరిత్రనే మార్చేస్తున్నదంటే ఆనంద్ ఆనందానికి హద్దు ఆకాశమే!

ఆకాశమంత ఎత్తులో నిలబడి ఒకసారి కిందికిచూస్తే ఆ గూడెం కనిపిస్తుంది. పెద్ద పెద్ద గంపల్ని కిందకి బోర్లించినట్లున్న ఆగుడిసెలు మనప్రగతికి నిదర్శనాలు!

ఆనంద్ కళ్ళల్లో పల్చని నీటిపొర!

అతనిచూపు అనుకోనట్లుగా గూడెంవైపు మళ్ళింది.

ఆ గూడెంలో నివశిస్తున్న వాళ్ళెవరు?– మనుషులే! ఈ దేశజనాభా ఆరుకోట్లకి చేరవేసిందానికి భాగస్వాములే! అయితే–

పుట్టగోచీలుపెట్టి, పుట్టాచెట్ల మీదపడి జీడిపప్పు సారపప్పు మొదలైన వాటిని సేకరించు కొంటూ కొండలకు కోనలకు పరిమితమైనవాళ్ళు! అటువంటి వాళ్ళను ఆంగ్లేయ ప్రభుత్వమే

కత్తెర కాలనీలకు పరిమితంచేసింది. అక్కడినుండి అడవులకు పోలేక కష్టపడి పనిచేయడం అలవాటులేక వాళ్ళుకొందరు స్వార్థపరులచేత కీలుబొమ్మలయ్యారు. వాళ్ళ అసరాతో జేబులుకత్తిరిస్తూ దారిదోపిడీలుచేస్తూ వాళ్ళని అందలాలెక్కించారు. తాము మాత్రం దొంగలూ దోపిడి గాళ్ళని ముద్రవేసుకొన్నారు.

ఆనంద్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

కిర్రుమని శబ్దంచేస్తూ జీప్ గూడెం ముందర ఆగింది.

జీప్ శబ్దం చెవుల్లోపడితేచాలు. ఎటున్న వాళ్ళటే కాలికి బుద్ధిచెప్పేవాళ్ళు– ఆనాడు జీప్ గూడెం ముందర ఆగడమే తరువాయి. ఒక్కసారిగా చుట్టుముట్టారు.

వాళ్ళసంబరం అంతైఇంతై ఆకాశమంత అయింది.

ఆరోజు గూడెంలో జాతర జరుగుతున్నట్లుంది.

ఆనంద్ ఎప్పుడో చిన్నప్పుడు చూసిన జాతర. సంధివయస్సులోచవిచూసిన జాతర. కలెక్టర్ హోదాలో పాలుపంచుకొంటూంటే పరవశం!– వశం తప్పుతూఉంది.

ఆనందోత్సాహాలు ఊపిరిగా ముందుకు కదిలిందా గుంపు. ఆ గుంపుల్లో ఆనంద్ బొగ్గుల్లో మాణిక్యం. ఉన్నట్లుండి కొంతమంది ఆ మాణిక్యాన్ని అమాంతంగా పైకెత్తుకొన్నారు. 'ఆనంద్‌బాబుకు జై! ఆనందు బాబుకు జై!' అని కేకలు వేస్తూ ముందుకుపోతున్నారు.

గూడెం గుండెల్లో వేదిక. ఆ వేదికను తయారుచేయడానికి సారాయి కాంట్రాక్టర్ చాలా శ్రద్ధతీసుకొన్నాడు. మారుబేరగాడు చేతులుకలిపాడు.

చూడముచ్చటగా తయారయింది వేదిక!

ఊరేగింపు వేదికవద్దకు చేరేసరికి డప్పుల మోత ఆగింది, ఈలలగోల ఆగింది. ఆటా పాటా ఆగింది. ఎక్కడివాళ్ళక్కడ ఆవేదిక ముందు 'గప్‌చిప్'మని కూర్చున్నారు. వాళ్ళ క్రమశిక్షణ గమనించిన కలెక్టరు ముగ్ధుడయ్యాడు. ఇక తనధ్యేయం నెరవేరడం ఖాయమని ఖరారు పరచుకొన్నాడు. అయితే దీని వెనుక సారాయి కాంట్రాక్టరు హస్తం ఉందన్న సంగతి గ్రహించలేక పోయాడు.

ఆనంద్ వేదికమీద నిలబడి ఒక్కసారి కలయచూశాడు.

గుంతలుపడిన కండ్లు... అంతకంటే గుంతలుపడిన కడుపులు... చిరిగిన దుస్తులు, పుట్టగోచీలు– దేశంలోని దారిద్ర్యాన్నంతా ముంచితెచ్చి కుప్పపోసినట్లుందక్కడ!

ఆనంద్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

అయినా తమాయించు కొన్నాడు.

"సోదర సోదరీమణులారా! ఈ జిల్లాకలెక్టరుగా మీపరిస్థితి నేను గమనించాను. ఎంతో పరితపిస్తున్నాను. ఈ స్థితిలో కాకుండా మిమ్మల్ని మరొక స్థితిలో చూడాలని కాంక్షిస్తున్నాను. సొమ్మొకడిది సోకొకడిదిగా సాగిపోతూందీ వ్యవస్థ. శ్రమశక్తిని యుక్తిగా కొల్లగొడుతున్నారు.

మీరు అష్టకష్టాలుపడి అడవులమీదపడి తెస్తున్న అటవీ సంపదను తేరకు కొట్టేసే వాడొకడైతే– ఆ పైసల్ని కూడా మీ నుండి దోచుకొనే స్వార్థపరులు కొంతమంది. దోచుకొన్నా... మీరు దొంగలు... దోపిడీగాళ్ళు. ఎక్కడ దొంగతనం జరిగినా పోలీసులు మిమ్మల్ని నానా హింసలు పెడుతున్నారు. ఈ జీవన విధానం మారాలి. మీకు పట్టాలిస్తున్నాను. పైసలిస్తున్నాను. మీరంతా కష్టపడి పనిచెయ్యండి. బంజరు భూముల్ని సస్యశ్యామలం చేయండి"– అని ఆనంద్ ఎంతో ఆవేశంగా మాట్లాడాడు.

సారాయి కాంట్రాక్టర్ మారుబేరగాళ్ళు మొగాలు మార్చిమార్చి చూసుకొన్నా, తప్పని సరిగా చేతులు తట్టేసరికి అంతవరకు ఏమీ అర్థంకాకుండా బిక్కమొగంవేసి వింటున్న వాళ్ళందరూ ఒక్కసారిగా చేతులుతట్టారు.

తాను చెప్పిందంతా వాళ్ళ తలకెక్కి తన ఆశయం తప్పక నెరవేరుతుందన్న భావనతో ఆనంద్ గుండె పొంగింది.

ఆ గూడెంలో ప్రతి ఇంటికి అయిదెకరాల నేలపట్టా ఇచ్చాడు. ఆ నేలలో చెట్టూ చేమా మిట్టాగట్టు కొట్టి చదును చేసుకోవడానికి తలకు వెయ్యిరూపాయల నగదు కూడా ఇచ్చాడు.

పట్టాలిచ్చే కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ఆనంద్ తృప్తితో తేలిపోతూ జీప్‌లో కూర్చున్నాడు.

మళ్ళీ ఒకసారి గూడెంలోని గుంపు జీప్‌ని చుట్టుముట్టింది. 'ఆనంద్ బాబుకు జై!' అని మారుబేరగాళ్ళు జై కొడ్తే జయజయధ్వానాలు మారుమోగాయి.

ఆనంద్ బయలుదేరాడు.

జీప్ గూడెందాటింది. గూడెం ముందర చింతతోపులో పోతూ ఉంది. ఉన్నట్లుండి 'ఆపు!' అన్నాడు ఆనంద్. జీప్ ఆగింది.

ఎదురుగా గవర్నమెంటు సారాయి అంగడి.

ఆనంద్‌చూపు ఆఅంగడిమీద పడింది!

చిన్నాపెద్దా తరతమ బేధాలు లేకుండా అందరూ సారాయి అంగడి మీదికెగబడుతున్నారు. వాళ్ళందరు తనచేతుల మీదుగా డబ్బుతీసుకున్న వాళ్ళే! ఒక్క క్షణంలో చిరునవ్వుల పూలు పూస్తున్న ఆనంద్ మొగం వివర్ణమైంది.

"తమ పిచ్చిగానీ ఆ దొంగనాకొకుడుకులెక్కడ మార్తార్లే సార్!"

ఆనంద్ చివుక్కున వెనక్కుతిరిగి చూశాడు. అతని చూపులు చురుక్కుమంటున్నాయి!– తహసీల్‌దార్ మెలికలు తిరిగిపోతూ చేతులు పిసుక్కొంటున్నాడు.

"క్షమించండి సార్!... ఇంతకుముందు కూడా సార్... ప్రభుత్వం సార్... వీళ్ళకు ఎంతో సహాయం చేసింది సార్!... వాళ్ళకు ఎంతో వినయంగా నటించడం అలవాటే సార్!... డబ్బు గుంజుకొంటారు సార్! ఆ మీదట అంతే సార్..."

తహసీల్‌దార్ బిడ్డను గిల్లిపెట్టి తొట్టి ఊచడానికి ప్రయత్నించాడు.

ఆనంద్ తల వాలిపోయింది!

"పద!" అన్నాడు. జీప్ బయలుదేరింది. బంగళాచేరే వరకు ఆనంద్ వంచినతలెత్త లేదు. బంగళా ఆవరణలో జీప్ ఆగింది. ఆనంద్ దిగాడు. మాటామంతీ లేకుండా వంచినతలెత్త కుండానే లోపలికి నడిచాడు.

తహసీల్‌దారు గుండెల్లో రాయిపడింది.

ఆ రాత్రి ఆనంద్ నిద్రపోలేదు. అతన్ని లాలించాలని ఎంతగానో ప్రయత్నించిన నీలిమ ప్రయత్నం ఫలించలేదు.

మామూలుగానే తెల్లారింది.

అటుఆఫీసులో ఇటు ఇంట్లో ముభావంగానే గడిచింది. పొద్దుగూట్లోపడింది.

రాత్రి తొమ్మిదిగంటల సమయం ఆనంద్ జీప్ తీసుకొని ఒంటరిగా బయలు దేరుతున్నాడు. అతని వాలకం చూసి 'ఎందుకు? ఎక్కడికి?' అని అడగడానికి నీలిమ నోరు పెగల్లేదు!...

అంత రాత్రిపూట ఒంటరిగా గూడేనికి వచ్చిన కలెక్టరుగార్ని చూసి గూడెం కలవర పడింది. క్షణాలమీద గూడెంగూడెం ఒకచోట గుమిగూడింది. ఒకడు మంచం తెచ్చి వేస్తున్నాడు. ఇంకొకరు మంచంమీదికి కంబళి పరుస్తున్నారు. కొందరు పాలోనీళ్ళో తెచ్చేదానికి పరుగెత్తుతున్నారు. కొందరు అతన్ని కూర్చోమని ప్రాధేయపడుతున్నారు.

ఆనంద్ కూర్చున్నాడు– మంచంమీద కాదు. వాళ్ళందరి మధ్య వాళ్ళలో ఒకడుగా కూర్చున్నాడు. అందరూ ఆశ్చర్యంలో తలమునకలవుతున్నారు.

"నేను మీవాణ్ణి అంటే మీజాతివాణ్ణి!" అన్నాడు ఆనంద్ గంభీరంగా వాళ్ళ భాషలోనే.

మూడు ముంతలకల్లు మూడు గుక్కల్లో తాగినంత అనుభూతిని పొందారు వాళ్ళు. ఆ అనుభూతిలోవాళ్ళు ఆనంద్ కలెక్టర్అన్న సంగతినే మరిచారు. అతనికి ఎంతో దగ్గరివాళ్ళయినా మన్న భావన వాళ్ళమొగాల్లో తేలియాడుతూ ఉంది.

ఆనంద్ చెబుతున్నాడు. వాళ్ళు వింటున్నారు.

అతడు చెప్పేది తలకెక్కక కొందరు తల గోక్కుంటున్నారు. కొందరక్కడికక్కడే గుర్రు పెడుతున్నారు. ముసలీ ముతకమాత్రం కలెక్టరు మీద భక్తికొద్దీ శ్రద్ధగా వింటున్నారు.

గూడెంలో తొలికోడి కూసింది!

ముసలీ ముతకకూడా ఆవులిస్తున్నారు.

ఆరోజుకు పాఠాన్ని ముగించి ఆనంద్ బయలుదేరాడు.

ఆరోజు నుండి ప్రతిరోజూ అంతే! గూడేనికిపోతున్నాడు. వాళ్ళని మనుషులుగా మార్చి మంచిదారినపెట్టాలని శతపోర్తున్నాడు. తనజాతి 'దొంగజాతి' అన్న శిలాఫలకం మీద చెక్కిన పేరును చెరిపేయాలన్న కృతనిశ్చయంతో పోతున్నాడు. అలి అలిగినా, ఆఫీసుపనులు క్షణం తీరిక లేకుండా చేస్తున్నా పట్టు వదలకుండా వెళ్ళుతున్నాడు.

ఒకనాడు ఆనంద్ యథాప్రకారంగా గూడెం చేరుకొన్నాడు.

చుక్క నడిమిట్టకు చేరపోతున్నవేళ. సాధారణంగా తాను అక్కడికి చేరేసరికి గూడెంలో అందరు కలిసి ఒకచోట గుంపుగా కూర్చుని తనకోసం ఎదురుచూస్తూ ఉండేవాళ్ళు, కానీ రోజు గూడెమంతా గడగడ వణికిపోతూ ఉంది. ఎటుచూసినా ఏడుపులు- పెడబొబ్బలు- హాహాకారాలు!

ఆనంద్ కంటపడేసరికి వాళ్ళందరికి దేవుడే దిగివచ్చినట్లుతోచింది. ఒక్కసారిగా అందరు అతని ముందరపడి "మమ్మల్ని రచ్చించండి దొరా!" అని లబోదిబోమని మొత్తుకొన్నారు.

ఆ పరిస్థితిని గమనించి ఆనంద్ కొయ్యబారిపోయాడు!

గిడ్డడు, కోటిగాడు, పోలిగాడికోసరం పోలీసులు గూడెమంతా సోదా చేశారు. వాళ్ళు కనిపించకపోతే వాళ్ళ ఆచూకి తెల్పమని అందర్ని చావగొడుతున్నారు. కొందరి బొడ్డుదగ్గర కుమ్మరపురుగునుబెట్టి పైన టెంకాయచిప్పను బోర్లించి కట్టారు. అది బొడ్డులో తొలుస్తూంటే విలవిల్లాడిపోతున్నారు.

అంతరాత్రిపూట కలెక్టర్ కంటపడేసరికి పోలీసుల ఆశ్చర్యానికి అవధులులేవు. అందరూ నిటారుకొమ్మల్లానిలబడి 'సెల్యూట్' చేస్తున్నారు.

"దేవళంపేట దేవాలయంలో విగ్రహాలచోరీ జరిగింది తమకు తెలుసు సార్! ఆరోజునుండి వీళ్ళల్లో కొంతమంది కేడీలు పరారయ్యారు సార్! వాళ్ళ కోసం వెతుకుతున్నాం సార్! అలాంటి పని వీళ్ళను తప్పించి మరొక్కరు చెయ్యలేరుసార్!" పోలీస్ అధికారి సంజాయిషీ!

"ఇకమీరు దయచేసి వెళ్ళచ్చు. ఉదయానవచ్చి బంగళాలో కలవండి. వాళ్ళను మీకప్పజెప్పే బాధ్యతనాది" హుందాగా అన్నాడు కలెక్టర్.

పోలీసులు తోకముడిచి తప్పుకొన్నారు.

ఆనంద్ కూర్చున్నాడు. అందరు అతని చుట్టు కూర్చున్నారు. ఆతురతగా అతని వైపు చూస్తున్నారు. ఆనంద్ వంచినతలెత్తలేదు. బొట్లుబొట్లుగా పడుతున్న కన్నీళ్ళు మాత్రం చీకటిలో రాలుతున్న ముత్యాల్లా మెరుస్తున్నాయి.

ఆరోజు గూడెం గుండెలు కుతకుత ఉడికాయి.

"వారం రోజులుగా వాళ్ళందర్నీ నా సంరక్షణలోనే ఉంచుకొన్నాను. ఆ సంగతి మీక్కూడా తెలియదు. వాళ్ళు కొంత అతివాదులు. వాళ్ళు మారితే మీరంతా మారుతారని నా నమ్మకం. ఐనా చూడండి నింద ఎవరిమీద పడిందో?"

ఆనంద్ నోటినుండి బరువుగా వెలువడ్డాయి మాటలు.

గూడెంలో మార్పుకు ఆరోజే అంకురార్పణ జరిగింది.

అయినా "ఒకరోజు కష్టపడితే ఏడాది పొడగనా కూసోని తినేది- వాదిలిపెట్టి ఇదెందుకొచ్చిన పీడ?" అని ఒక వర్గం ఎదురుతిరుగుతూనే ఉంది.

ఆనంద్ మాత్రం పట్టువదలకుండా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

ఆరోజుతో ఆఖరిరోజు. ఆరోజే గూడెం తన నిర్ణయాన్ని తెలియజేస్తుంది. ఆరోజుతో అటోయిటో తేలిపోవాలి. ఒక సమయం గూడెం నిర్ణయమే మరొక విధంగా ఉంటే– తనకు ఆమరణ నిరాహారదీక్షే శరణ్యం. తాను బలైపోయినాసరే!– వాళ్ళు మారాలి. మనుషులుగా జీవించాలి. అందుకే తనకోసరం ఎంతో త్యాగంచేసిన అర్ధాంగి అంతగా ప్రాధేయపడినా తెగతెంపుల స్థితికి ఎదిగినా పట్టించుకోకుండా బయలుదేరాడు.

అతుకుల గతుకుల బాటమీద జీపు పడుతూలేస్తూ పోతూ ఉంది!

* * *

రాత్రి మలిజాము తొంగిచూస్తున్నవేళ గూడెంలో కోలాహలంగా ఉంది. పోలేరమ్మ జాతరకో ఏ పోలిగాడి పెండ్లికో జరిగే కోలాహాలానికి మించిన కోలాహలం. అయితే ఈ కోలాహానికీ జాతరకో పెండ్లికో జరిగే కోలాహాలానికి ఒక్కటే తేడా!– జాతరకో పెండ్లికో అయితే తాగిన మైకంలో కోలాహలం. ఆరోజు ఏదో తెలియని ఆనందంతో కోలాహలం!–

ప్రతి చూపు బాటమీదనే ఉంది. ప్రతి చెవి జీప్ శబ్దాన్నే ఎదురుచూస్తూ ఉంది. ప్రతి గుండెలో ఆనంద్‌బాబు మెదులుతూనే ఉన్నాడు. అతడు రావడమే తరువాయి!– అతని కాళ్ళమీదపడి అతని అడుగుజాడల్లో నడస్తామని ప్రయాణం చేయడానికి నువ్వు ముందా? నేను ముందా? అని తహతహ పడుతున్నట్లుంది.

తొంగిచూసినతొలిజాము తొలిగిపోయింది. నడిజాము గడుస్తూఉంది.

అతడు రాలేదు!

ప్రతి గుండె ఆందోళన పడూతూ ఉంది. కారణం ఊహించలేక ఆశ్చర్యపడుతూ ఉంది. 'అనుకొన్న వేళకే వచ్చే మనిషి ఎందుకు రాలేదబ్బా?' అని ఆరాటపడుతూ ఉంది.

తొలికోడి కూసేవేళయింది.

అప్పటికీ అతడు రాలేదు.

అతడు వచ్చినా సరే! రాకపోయినాసరే! ఆరోజు తమ నిర్ణయాన్ని తమ నాయకుడికి తెలియచేయాలన్నది వాళ్ళసంకల్పం. ఎటుమళ్ళితే అటేగదా వాళ్ళతత్వం. అందుకే ఇంటికొక్కమనిషి చేతికొక్క కాగడాపట్టి బయలుదేరారు. భల్లుమని తెల్లారేసరికి కలెక్టర్ బంగళా ముందు నిలబడి కలెక్టర్ నిద్రకళ్ళతో ఉండగానే ఆ కళ్ళల్లో వెలుగుగా మిగిలిపోవాలని ముంపుగా బయలుదేరారు. 'ఆనంద్‌బాబుకు జై! కలెక్టర్ బాబుకుజై!' అని నినాదాలు చేస్తూ బయలుదేరారు.

ఒక్క మోపున నడుస్తున్నారు!

పల్లేరుమిట్ట దాటారు. మొండోడి గుట్ట మలుపుతిరిగారు. నక్కలవాగులో అడుగుపెట్టారు. అడుగు ముందుకు పడకుండా అలానే నిలబడిపోయారు.

ఆ వాగులో జీప్ తలకిందులుగా పడిఉంది!

అందరి తలలు గిర్రునతిరిగాయి. నిలదొక్కుకుని నిలబడి చూశారు. సందేహమే లేదు. అది ఆనంద్‌బాబు జీపే! హాహాకారాలు చేస్తూ జీపు దగ్గరికి పరుగెత్తారు. జీప్‌ను చుట్టుముట్టారు. కాగడాల వెలుగు వాగులోని చీకటిని చెదరగొడితే– ఆ జీప్ కింద ఆనంద్‌బాబు శవం నెత్తురుముద్దగా కనుపిస్తూ ఉంది!

అందరినడుములు నిలువునా విరిగాయి. కుప్పగా నేలకూలారు. ఒకరికిమించి ఒకరుగా ఏడుస్తున్నారు.

ఏనాడో ఎండిపోయిన నక్కలవాగు వాళ్ళు కార్చి కన్నీళ్ళతో కాలువలు గట్టింది!...

* * *

తూర్పుకొండలవెనుక సూర్యుడు నెత్తురు ముద్దలా కనిపిస్తున్నాడు.

తెల్లవారు జామున్నే రావలసిన భర్త రాలేదని నీలిమ ఎదురుచూస్తూ ఉంది. ఆమె మనసు పరిపరివిధాల పోతూఉంది. గుండెలు పిండుతున్నట్లుంది. 'రాత్రి ఆయన బయలుదేరుతుంటే అపశకున పక్షిలాగా ఎందుకలా అడ్డం మాట్లాడానా?' అని మనసు మధనపడుతూఉంది. ఒకచోట నిలబడలేక కాలుగాలిన పిల్లిలా బంగళా లోపలికి బయటికి తిరుగుతూ ఉంది.

అంతలోనే బంగళా కాంపౌండుకవతల బంగళావైపుగా వస్తున్న ఓ గుంపు కంటబడింది. ఆ గుంపుచేస్తున్న అర్థంగాని రంపు చెవినిపడింది. ఆమె వాకిట్లోనిలబడి అలానే చూస్తూ ఉంది. చూస్తూచూస్తూ ఉండగానే ఆ గుంపు బంగళా గేటుదాటి పరుగులమీద వస్తూ ఉంది. వస్తున్న గుంపు ఏదో మోసుకొని వస్తున్నట్లుంది. గుండె గుప్పిటపట్టి ఆమె కన్నార్పకుండా అలానే చూస్తూ ఉంది. ఆ గుంపు వెనకాముందు చూడకుండా ఒక్క లగువులో వచ్చింది. మోసుకొనివచ్చిన శవాన్ని ఆమె ముందు పడుకోబెట్టింది.

ఒక్కక్షణం ఆ శవంవైపు నిదానించి చూసింది నీలిమ.

అంతే!– కుప్పగా కూలిపోయింది!

ఆగమేఘాలమీద ఈ వార్త ఊరంతా ప్రాకింది.

ఎస్పీ వేణుగోపాల్ క్షణాలమీద అక్కడికి చేరుకొన్నాడు.

తెలిసినవాళ్ళు తెలిసినట్టే ఊళ్ళోవాళ్ళంతా పెద్దాచిన్నా తరతమభేదాలులేకుండా బంగళాకు పరుగులు తీస్తున్నారు.

"ఇంతమంచోణ్ణి! ఇంత తొందరగా తీసకపోయ్యేదానికి నీకెట్టా మణుసొప్పిందిరా దేవుడా!" అని వాపోతూ చుట్టు పక్కల పల్లెజనం తీర్థానికో తిరునాళ్లకో నడిచినట్లు నడుస్తున్నారు.

"మావల్లగదా దొరా! నీకీగెతి పట్టింది?" అని గూడెంలోని గుంపు పొర్లిపొర్లి ఏడుస్తూ ఉంది.

నీలిమ గుండె చెరువయ్యేలా రోదిస్తూ ఉంది.

బంగళాలో కాకిశోకం హృదయ విదారకంగా ఉంది. ఆనంద్ అత్యంత ఆప్తమిత్రుడు వేణుగోపాల్. ఎక్కడో ఒకమూల ఎవరికంటా పడకుండా గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు.

ఇక తప్పదన్నట్లుగా తనకు తానుగా సమాళించుకొన్నాడు. నీలిమ దగ్గరికివచ్చాడు.

"అన్నయ్యా!" అంటూ ఆమె అతని కాళ్ళకు చుట్టుకొని పోయింది.

వేణుగోపాల్ కండ్లల్లో నీళ్ళు చెంపలమీదుగాజారి బొట్లుబొట్లుగా ఆమె మీద పడుతున్నాయి. అయినా నిబ్బరించుకొన్నాడు.

"అమ్మా! చదువుకొన్నదానివి. నువ్వే ఇలా అయితే ఎలా? నిన్ను చూసి మేము, మమ్మల్నిచూసి నువ్వు ఏడుస్తూ కూర్చుంటే ఏమవుతుంది? అలా చూడు. ఆ అమాయక జనం వైపు చూడు. లేచి వాళ్ళని ఓదార్చు. లే! లేమ్మా లే!– మార్పు ఎప్పుడూ ఒక బలిని కోరుతుంది. నీకు తెలియనిదేముంది? ప్రజల బాధల్ని పంచుకోవాలనుకొన్న అలనాటి జీసస్ ఏమైనాడు? అబ్రహాంలింకన్ ఏమైనాడు. కడకు ఈనాటి మహాత్ముడేమైనాడు? ఇంతవరకు నీభర్తకు నీ గుండెల్లో మాత్రమే స్థానం. ఇప్పుడు ఇంతమంది గుండెల్లో వెలుగుగా నిలిచిపోతాడు. మంచి వాళ్ళచావును మరణమప్పుడేచూడాలన్నారు. చూస్తున్నావుగదా? నీ భర్తనే ఒక దైవంగా నీ బంగళాను ఒక దేవాలయంగా భావించిన ఆ అమాయకుల్ని చూడమ్మా! వాళ్ళ ఏడుపులు వినమ్మా!– లేచి నిలబడమ్మా– నీ భర్త స్థానంలో నిలబడి వాళ్ళకు ధైర్యం చెప్పమ్మా! అప్పుడే నిజంగా ఆనంద్ ఆత్మ శాంతిస్తుంది. లేమ్మా లే!... ఇదెలా జరిగిందో నేను ఆరా తీస్తాను."

పోలీసు ఆఫీసరైనా స్పందించే గుండెతో పలికిన వేణుగోపాల్ మనిషే!

భర్త సత్సంకల్పాన్ని బ్రతికుండగానే అవగాహన చేసుకోలేకపోయానే!– అని తన అవివేకానికి విలపిస్తున్న నీలిమా మనిషే!

"రాత్రి లేదు. పగల్లేదు. క్షణం తీరికలేదు. జిల్లాబాగోగులే తన బాగోగులుగా భావించి శ్రమించడంతో విశ్రాంతిలేదు. రాత్రిపూట జీప్ నడుపుతూంటే కంటిమీద రెప్పట్లాపడి ఉంటుంది. జీప్ బోల్తాకొట్టి ఉంటుంది." అని తలపోస్తున్న మందీ మనుషులే!

గూడెంలోని గుంపు మారితే తమ బతుకులే తారుమారవుతాయన్న స్వార్థంతో నక్కలవాగు దగ్గర పొంచి ఆనంద్‌ను చంపించి జీప్‌కింద పడేసిన సారాయి కాంట్రాక్టర్, మారుబేరగాళ్ళూ– మనుషులే!

అడుగుబడుగు వర్గాల అభ్యున్నతికోసం బలి అయిన ఆనంద్ మనిషే!

అందుకే తూర్పుదిక్కున నెత్తుటిముద్ద తెల్లపోయి చూస్తూఉంది.

'ఇదింతేలే!' అన్నట్లుగా ముందుకుసాగిపోతూ ఉంది.

వాడు మండేవాడు!

మండేవాడికిది మామూలే!! ●

స్వాతి మాసపత్రిక
(1, ఆగస్టు 1984)